ప్రజాశక్తి
ఆదివారం 10 ఆగస్టు 2025
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





ఆది నుంచీ కాసుల సృష్టి

- విశాఖ కేంద్రంగా శిశువుల వ్యాపారం
- డిఎన్ఎ రిపోర్టులు తారుమారు చేసి మోసాలు
- పలు కేసులున్నా బోర్డులు మార్చేస్తూ చెలామణి
- ఒక్కొక్కటిగా నేరాలన్నీ వెలుగులోకి.. కొనసాగుతున్న అరెస్టులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'సృష్టి' డాక్టర్ పి నమ్రత. ఈ పేరు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. సరోగసీ పేర జరుగుతున్న దందాయే అంతటికీ కారణం. సికింద్రాబాద్‌లో వెలుగు చూసిన సరోగసి వ్యవహారం మొత్తం విశాఖ కేంద్రంగానే నడవడంతో యూనివర్శల్ సృష్టి ఐవిఎఫ్ సెంటర్ విశాఖపట్నం అధిపతి డాక్టర్ నమ్రత కాసుల వేట వెల్లడైంది. ఈ కేసులో నేరాలన్నీ ఒక్కొక్కటికీ రోజురోజుకూ వెలుగు చూస్తున్నాయి. సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్టు చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన దంపతుల నుంచి వీర్యం, అండం సేకరణ, బిడ్డను అప్పగింతతో ఈ మొత్తం వ్యవహారం బయటపడింది. సుమారు 15 ఏళ్లుగా సృష్టి సరోగసి వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ సరోగసి దందాలో అనేక మంది భాగస్వాములు కావడం, దీని వెనుక రూ.కోట్లు చేతులు మారిన విషయం వెల్లడవుతోంది. విశాఖ సృష్టి ఆసుపత్రితో సంబంధం ఉన్నట్టు పేర్కొంటూ కెజిహెచ్ ఆసుపత్రి అనస్తీషియన్ వాసుపల్లి రవికుమార్, గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి, పిల్లల విభాగం అధిపతి డాక్టర్ విద్యుల్లతను కూడా పోలీసులు గడచిన నాలుగు రోజులుగా విచారిస్తున్నట్టు తెలుస్తోంది. నేడు, రేపు ఇంకా ఎంతమంది ఈ అరెస్టుల జాబితాలోకి మిగతా 2లో..




సృష్టి సెంటర్ నడిచింది ఈ భవనంలోనే...

కెజిహెచ్‌కు సంబంధం లేదు

- సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

వార్త 2లో..



మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కును అందజేస్తున్న హోం మంత్రి అనిత

సిలిండర్ పేలుడు ఘటనపై దర్యాప్తు

- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలోని బుక్కావీధి వద్ద వెల్డింగ్ షాపులో ఇటీవల సిలిండర్ పేలి ముగ్గురు మృతిచెందిన ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, నివేదిక వచ్చాకే కారణాలు తెలుస్తాయని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను ఆమె శనివారం అందజేశారు. తొలుత నగరంలోని ఫిషింగ్ హార్బరు ప్రాంతంలో నివసిస్తున్న మృతుడు చింతకాయల ముత్యాలు ఇంటికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావులతో కలసి వెళ్లారు. వారి కుటుంబీకులను పరామర్శించారు. ముత్యాలు మిగతా 2లో..

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలి

వార్త 5లో..

ఆదివాసీలంటేనే సహజ నైపుణ్యం, సామర్థ్యం : చంద్రబాబు

వార్త 8లో..

ఉక్కు దీక్షా శిబిరం కొనసాగింపునకు అనుమతులు

పోరాట కమిటీ హర్షం

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పోరాటానికి కొంత మేరకు ఊరట లభించింది. పోరాట కమిటీ కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద దీక్షా శిబిరాన్ని నిర్వహించుకోవచ్చునని హైకోర్టు జడ్జి వెంకటేశ్వరరావు ఆర్డర్ జారీ చేశారు. దీనిపై ఉక్కు కార్మికులు, పోరాట కమిటీ నేతలు శనివారం హర్షం వెలిబుచ్చారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నాలుగేళ్ల పైచిలుకు కాలంగా పోరాటం నడుస్తోంది. దీక్షలు కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వచ్చిన భారీ వర్షానికి పోరాట కమిటీ టెంట్ కూలిపోయింది. తిరిగి టెంట్ వేసుకునేందుకు పోలీసులు అంగీకరించలేదు. దీక్షా శిబిరానికి ఎవరినీ అనుమతించలేదు. లోపలికి వెళ్లకుండా చుట్టూ ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. తుదకు పోరాట కమిటీ న్యాయ పోరాటం గెలిచింది. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ పోరాట కమిటీ దీక్షా శిబిరాన్ని నిర్వహించకుండా ఉండేందుకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అనేకమార్లు వాయిదాలు తీసుకుందని తెలిపారు. అయినప్పటికీ జడ్జి వెంకటేశ్వరరావు కార్మికుల పట్ల నిబద్ధతను గమనించి పోరాట కమిటీ దీక్షా శిబిరాన్ని కొనసాగించవచ్చని ఆర్డర్లు జారీ చేశారని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ వద్ద అనుమతులు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. అనంతరం దీక్షా శిబిరాన్ని కొనసాగించనున్నట్టు తెలిపారు.



విశాఖ నగరంలో బస్సు డ్రైవర్‌కు రాఖీ కడుతున్న ఎస్ఎఫ్ఐ మహిళా నాయకులు

ఘనంగా రక్షా బంధన్

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధం వెల్లివిరిసింది. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన బస్సు డ్రైవరన్నలకు, కండక్టర్లకు, ప్రయాణికులకు రాఖీలు కట్టారు. విశాఖ నగరంలో పోలీసులకు, ఖైదీలకు, ఆటోడ్రైవర్లకు హోం మంత్రి అనిత రాఖీలు కట్టారు. మహిళా సంరక్షణను ఉద్దేశించి మాట్లాడారు.

మొదటి పేజీ తరువాయి..

ఆది నుంచీ కాసుల సృష్టి

వచ్చి చేరతారన్న చర్చ విశాఖలో నడుస్తోంది.

అనేక కేంద్రాల నుంచి సరోగసి అక్రమాలు

సృష్టి ఆసుపత్రిలో సరోగసి పేరుమీద విశాఖపట్నం, విజయవాడ, భువనేశ్వర్, కొల్‌కతాల్లో ఫెర్టిలిటీ సెంటర్లను డాక్టర్ నమ్రత నడుపుతున్నారు. పై రాష్ట్రాలకు చెందిన పిల్లలు లేని ధనిక దంపతులు పలువురు ఈమె నిర్వహించే ఆసుపత్రులకు రావడం, సరోగసి ద్వారా పిల్లలను తీసుకెళ్లడం ఏళ్లతరబడి నడుస్తోంది. తాజాగా రాజస్తాన్‌కు చెందిన గోవింద్ సింగ్, ఆయన భార్య సోనియా దంపతులు బిడ్డ కోసం రూ.40 లక్షలు డాక్టర్ నమ్రతకు చెల్లించడం, వీర్యకణాలు, అండాలను సేకరించిన తర్వాత వేరొక బిడ్డను వారికివ్వడం, ఢిల్లీలో వీరు డిఎన్ఎ ద్వారా రుజువు పరచుకోగా తమ బిడ్డ కాదని తేలడం.. వరుసగా చోటుచేసుకున్నాయి. దీంతో వారు సికింద్రాబాద్‌లోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో డాక్టర్ నమ్రత అరెస్టు అయ్యారు. తర్వాత విశాఖలోగల యూనివర్శల్ సృష్టి ఆసుపత్రికి చెందిన మేనేజర్ కల్యాణిని అరెస్ట్ చేశారు. మరో డాక్టర్, నర్సుల పాత్ర కూడా ఉండడంతో వారిపైనా నిఘా పెట్టారు. ఇంకా 25 మందికి ఈ వ్యవహారంలో ప్రత్యక్ష సంబంధం ఉండడంతో వారి కోసం పోలీసులు వెతుకులాట ప్రారంభించారు.

సృష్టి కేసులో ప్రధాన నిందితురాలిగా అరెస్టయిన డాక్టర్ నమ్రత సహా కొందరు కెజిహెచ్ వైద్యులు కూడా విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ విద్యనభ్యసించినవారే. డాక్టర్ నమ్రతకు ఈ వ్యవహారంలో కొందరు సహాయ సహకారాలు అందించినట్టు తెలుస్తోంది. ఇంకా విశాఖకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, లేబ్స్‌లో పనిచేస్తున్న పలువురు సృష్టి వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నట్లు అర్థమవుతోంది. గడిచిన రెండేళ్లలో విశాఖ కేంద్రంగా 100 నుంచి 150 మంది పిల్లలను ఇలా సృష్టి యాజమాన్యం విక్రయించినట్లు తెలుస్తోంది. 2013 నుంచి 2016 మధ్యలో పలు కేసులు కూడా అక్రమ సరోగసిపై నమోదయ్యాయి. చాలా మంది దంపతుల్లో సృష్టి వ్యవహారంపై అనుమానాలున్నా బయటకొస్తే ఏమౌతుందోనన్న ఆందోళన వారిలో నెలకొంది. రాజస్తాన్ దంపతులు మాత్రమే డిఎన్ఎ పరీక్ష నిర్వహించుకుని వచ్చి మరీ ఫిర్యాదు చేయడంతో భాగోతం బయటపడింది.

కెజిహెచ్‌కు సంబంధం లేదు

సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తో కెజిహెచ్, ఆంధ్ర మెడికల్ కళాశాలకు ఎటువంటి సంబంధమూ లేదని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాలపై పలు మీడియా కథనాలు రావడం, అందులో కెజిహెచ్ డాక్టర్ల ప్రమేయంపై పలు అంశాలు ఉండటంపై వారు స్పందించారు. కెజిహెచ్ విశిష్టతను ప్రశ్నిస్తూ రాయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణా పోలీసు శాఖ వారు విచారణ చేపట్టి అందులో కెజిహెచ్, ఆంధ్రా మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్ల ప్రమేయం ఉన్నట్లు తమకు మీడియా ద్వారా మాత్రమే సమాచారం వచ్చినట్టు వారు పేర్కొన్నారు. సదరు విషయమై ఎటువంటి అధికారిక సమాచారమూ ఇప్పటి వరకు తమకు అందలేదన్నారు. సదరు ఇద్దరు డాక్టర్లు వారి వ్యక్తిగత హోదాలో సేవలు అందించి ఉండవచ్చునని తెలిపారు. వారి ప్రమేయం ఉన్నట్లయితే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీడియా ద్వారా సమాచారం రాగానే తాము వారిని ఫోను ద్వారా సంప్రదించగా వారి ఫోన్లు పనిచేయడం లేదని తెలిపారు.

సిలిండర్ పేలుడు ఘటనపై దర్యాప్తు

భార్య ప్రమీల, వెల్డింగ్ షాపులో పనిచేసే మరో వ్యక్తి శ్రీను భార్య లక్ష్మిలతో మాట్లాడి వారికి ప్రభుత్వం అండగా వుంటుందని, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. సున్నపు వీధిలో నివసిస్తున్న గణేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి సాయం అందించారు. ఆయన భార్య సుధకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ముగ్గురు మరణించారని, గాయాల పాలైన వారిలో ఎర్రా ఎల్లాజీ, రంగారావు కెజిహెచ్‌లో, పి.సన్యాసి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారికి అందుతున్న వైద్య చికిత్సలను నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా, మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను ఆదేశించామన్నారు. వెల్డింగ్ షాపు సమీపంలోని పలు దుకాణాల్లో వున్న వారు కూడా ఈ ఘటనలో గాయపడినట్లు తెలిసి, వారికి కూడా వైద్య సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో వెనువెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన నగర పోలీసు కమిషనర్‌ను, జిల్లా కలెక్టర్‌ను, ఇతర అధికారులను అభినందించారు. సిలిండర్ పేలుడు ఘటనపై పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల దర్యాప్తు జరుగుతోందని, పేలుడుకుగల కారణాలపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని చెప్పారు. ఈ పర్యటనలో ఎన్‌టిఆర్ వైద్య సేవ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ 144వ వ్యవస్థాపకుని దినోత్సవాన్ని ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దేశంలోని మొట్టమొదటి స్వదేశీ బ్యాంకును స్థాపించిన సర్ సోరాబ్జీ పోచ్‌ఖనావాలా జన్మ దినాన్ని పురస్కరించుకొని ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రాంతీయ అధికారి ఎ.వి.ఆర్.మూర్తి వ్యవస్థాపకుడి చిత్రపటానికి పూలమాల వేశారు. ఉద్యోగులు సేవ, నిజాయితీ నిబద్ధత అనే వ్యవస్థాపకుని దృష్టిని ఆచరణలో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయం సమీప శాఖల సిబ్బంది పాల్గొని, వ్యవస్థాపకుని వారసత్వాన్ని కొనసాగించాలనే తమ ప్రతిజ్ఞను పునరుద్ఘాటించారు.

ఇంద్రజాలకుడు బిఎస్.రెడ్డికి అంతర్జాతీయ ఖ్యాతి



మెర్లిన్ అవార్డుతో బిఎస్.రెడ్డి

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలకుడు బి.ఎస్ రెడ్డి 'ఆస్కార్ ఆఫ్ మ్యాజిక్'లో చోటు సంపాదించి, అమెరికాలో 'మెర్లిన్ అవార్డు-2025'ను అందుకుని అత్యుత్తమ ఇంద్రిజాలకునిగా గుర్తించి ప్రతిష్టాత్మకమైన 'మెర్లిన్ అవార్డు-2025'ను శుక్రవారం రాత్రి అమెరికాలోని లాస్‌వెగాస్‌లో ప్రదానం చేశారు. మ్యాజిక్ అకాడమీ అవార్డ్స్ నైట్-2025లో భాగంగా బిఎస్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఇంటర్నేషనల్ మెజీషియన్స్ సొసైటీ నుంచి బెస్ట్ ఇల్యూషనిస్ట్ ఆఫ్ ఇండియాగా మెర్లిన్ అవార్డు-2025 అందుకోవడం గర్వంగా ఉందని బి.ఎస్ రెడ్డి మీడియాకు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణంపై సమీక్ష

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్: ఎపిఎస్‌ఆర్టిసి రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు, ఈ నెల15వ తేదీ నుండి ప్రారంభించే స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణంపై విశాఖ జిల్లాలో బస్సులు, బస్‌స్టేషన్ మెయింటినెన్స్ మీద సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం జిల్లాలో ద్వారకా బస్‌స్టేషన్ లో కొత్తగా బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. బస్‌స్టేషన్ శుభ్రత మొదలగు అంశాలపై అధికారులు సూపర్‌వైజర్లకు 15న ముఖ్య అతిథులతో ప్రారంభించేందుకు డిపో మేనేజర్లు సిద్ధం కావాలని తెలిపారు.

కార్యక్రమంలో డిపో మేనేజర్ సింహాచలం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

11న ఐద్వా విశాఖ జిల్లా మహాసభలు


సమావేశంలో పాల్గొన్న పద్మ, సత్యవతి తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా 17వ మహాసభలను ఈ నెల 11న మద్దిలపాలెం సవేరా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించాలని, శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన ఐద్వా విశాఖ జిల్లా కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఈ విషయాన్ని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మీడియాకు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారంలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఐద్వా 1936లో కష్ణా జిల్లాలో ప్రారంభమైందన్నారు. దేశవ్యాప్త సంఘంగా 1981లో ఏర్పడిందన్నారు. సమాన హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. సెక్షన్ 498ఎ ను కాపాడుటకు నిరంతర కషిని సాగిస్తుందన్నారు. మద్దిలపాలెం వేదికగా జిల్లా మహాసభలకు సిద్ధమవుతుం దన్నారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

గెలుపు కోసం టిడిపి అడ్డతోవలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికల్లో గెలుపు కోసం అధికార తెలుగుదేశం పార్టీ అన్ని అడ్డతోవలు తొక్కుతోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం సాయంత్రం విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత పోలింగ్ కేంద్రాలను మార్చడం ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల్లో పోలీసులు, తెలుగుదేశం నాయకలు కలిసిపోయి పనిచేస్తున్నారని, వారి ప్రోత్సాహంతోనే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి జరిగిందని ధ్వజమెత్తారు. ఈ దాడిలో బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఇటీవల రాష్ట్ర గవర్నర్‌ను వివరించాలమన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని ఆయన విమర్శించారు.

ఆదివాసీ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు శనివారం ఉదయం ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్‌లో జెండా ఆవిష్కరణతో మొదలై, నేటి నుండి ఆగస్టు 15వ తేదీ వరకు వారం రోజులపాటు (ఆదివాసీ వారోత్సవాలు) నిర్వహిస్తున్నామని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి శోభన్ కుమార్ తెలిపారు. శనివారంకార్యక్రమానికి అధ్యక్షత వహించిన సోనయీ అప్పలరాజు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితిలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం చేసుకోవాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ ప్రజలు హక్కులను పరిరక్షణ కొరకు మరియు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాము, శోభన్, ప్రసాద్, కర్రిదొర, తిలక్, గౌరవ అధ్యక్షులు సత్యారావు, రామ్‌నాయుడు, భవన అధ్యక్షులు దాలిబాబు ,రామలింగము. శేఖర్, గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ, కొమ్మాది : గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గిరిజన దినోత్సవాన్ని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బి.సురేష్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శివ ప్రసాద్ ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు.

21న క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - అనకాపల్లి

ఈ నెల 21న అనకాపల్లి జిల్లా రావికమతం మండలం దొండపూడి గ్రామంలో శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ పండగ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. వీటిని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు పర్యవేక్షణలో తలపెట్టారు. ఆ వివరాలను వెల్లడిస్తూ ఉత్సవ కమిటీ, ఎమ్మెల్సీ మిత్రబృందం శనివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఈ క్విజ్ పోటీల్లో యువతీ యువకులు, ఉద్యోగులు ఎవరైనా పాల్గొనవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. వయోపరిమితి లేదని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం https://forms.gle/4kkdXvrwstNE8GCH లింక్‌ను క్లిక్ చేయాలని కోరారు. విజేతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు సహా కన్సోలేషన్ బహుమతి కింద రూ.2 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9494349262, 8121434071 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్వాతంత్ర ఉద్యమ కాలంలో క్విట్ ఇండియా నినాదం దేశాన్ని ఊపివేసిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సామాజిక భవన స్థలం అమ్మకానికి యత్నాలు

- గతంలోనూ విక్రయం
- స్థానికుల ఫిర్యాదుతో స్వాధీనం, హెచ్చరిక బోర్డు ఏర్పాటు
- మళ్లీ అమ్మేందుకు సన్నాహాలు



రవీంద్రనగర్‌లో ఉన్న సామాజిక భవన స్థలం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10, 11 వార్డుల సరిహద్దులో ఉన్న సామాజిక భవనానికి చెందిన స్థలాన్ని విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే స్థలం సుమారు 10 నెలల క్రితం విక్రయానికి గురైంది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు, కొన్ని దినపత్రికల్లో వచ్చిన వార్తల కారణంగా జివిఎంసి, రెవెన్యూ అధికారులు అడ్డుకొని హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. బోర్డును పక్కకు నెట్టేసి మళ్లీ ఆ స్థలాన్ని అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జివిఎంసికి చెందిన సుమారు 200 చదరపు గజాల స్థలాన్ని గ్రామ సంఘం సభ్యులు గతంలో రూ.40 లక్షలకు వేరొకరికి అమ్మేసారు. ఇక్కడ బహిరంగ మార్కెట్ ధరలను బట్టి సుమారు రూ.1.50 కోట్ల వరకు పలుకుతుంది. సామాజిక అవసరాల కోసం ఉంచిన స్థలాన్ని కారు చౌకగా అమ్మేయడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసి ఫిర్యాదులు చేశారు. దీంతో జివిఎంసి అధికారులు మేల్కొని ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని, ఎవరైనా ఆక్రమిస్తే శిక్షార్హులని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొన్ని నెలలు గడిచిన తరువాత ఇప్పుడు అదే స్థలాన్ని అమ్మేందుకు మళ్లీ ప్రయత్నాలు చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. స్థానికులకు ఉపయోగపడేలా నిర్మాణం చేపడితే ఇటువంటి ప్రయత్నాలు ఉండవని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సామాజిక భవన స్థలం అన్యాక్రాంతం కాకుండా ఇక్కడ సామాజిక భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-ఆనందపురం : తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి స్వగృహంలో ఆయన అనుచరులు దళిత యువకుడిని నిర్బంధించి దాడి చేసిన ఘటనపై మాల మహానాడు నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఆనందపురం మండలం లోడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద మాల మహానాడు మండల అధ్యక్షుడు సియ్యాద్రి రాంబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు బోని సన్నిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కులాల మధ్య రాజకీయ అధికారం మారుతున్నా, దళితుల పరిస్థితిలో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ, తిరుపతి ఘటన కరుణాకర్ రెడ్డి ప్రమేయంతో జరిగిందని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కాకినాడ దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య, డాక్టర్ సుధాకర్ మరణం, చీరాల కిరణ్ ఘటన, రాజానగరం ప్రసాద్ శిరోమండనం వంటి అనేక దాడులు జరిగినా న్యాయం జరగలేదని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా గుర్రంపాలెం బాలికపై సామూహిక అత్యాచారం, తిరుపతి జిల్లాలో బిటెక్ విద్యార్థి జేమ్స్‌పై దారుణ హింస, పిఠాపురం సామాజిక బహిష్కరణ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలో దళిత హోంమంత్రి ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లంక పైడిరాజు, రాచర్ల ముకుందరావు, యాగంటి రామారావు, ఎజ్జల దాసు, బోని ముత్యాలు, నిమ్మకాయల అప్పలరాజు, సియాద్రి వాసు, బొబ్బిది రామారావు, పొట్నూరి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎపి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన 'ఫాదర్ ఆఫ్ లవ్' నాటికలో ఓ సన్నివేశం

సృజనాత్మకతను వెలికి తీసేందుకు నాటక పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నాటిక పోటీలు దోహదపడతాయని ఎంఇఒ- 1, 2 లు ఎం .శివరాణి, డి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కళాసాహితీ సంస్థ అధ్వర్యంలో స్థానిక ఎంఢిఒ కార్యాలయంలో రెండ్రోజుల పాటు జరుగనున్న నాటక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చదువుతో పాటు కళలు, సాహిత్యం, క్రీడల పట్ల విద్యార్థులు ఆశక్తి కనబరచాలని సూచించారు. స్థానిక సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ తొలుత జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన కళాసాహితీ సంస్థ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ, తమ సంస్థ ఆహ్వానం మేరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారంటే నాటికల పట్ల వారికున్న ఉత్సుకత ఇట్టే కనబడుతోందన్నారు. కళాసాహితీ సంస్థ గౌరవాధ్యక్షులు ఆర్.అప్పల నరసయ్య, సంస్థ సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థినులు ప్రదర్శించిన 'ఫాదర్ ఆఫ్ లవ్' నాటిక ఎంతగానో ఆలోచింపజేసింది.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవన నిర్మాణ పురోగతిని పరిశీలించి, పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, ఆన్‌లైన్ నివేదికలు, మందుల గది, లేబర్ రూమ్, ప్రయోగశాల, వార్డులను పరిశీలించారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రసవ గది, శస్త్రచికిత్స కోసం అవసరమైన ఆధునిక పరికరాలను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని, టీకాల కార్యక్రమం పద్ధతిగా నిర్వహించాలని, గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షబీనా భాను, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం : హెరిటేజ్ ఫెస్ట్-2025 పేరిట ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గంభీరం ఐఐఎం రోడ్డులోని హరే కృష్ణ వైకుంఠం, రాధా మదన మోహన్ మందిరంలో శనివారం శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. బృందాలు, వ్యక్తిగత విభాగాలలో నిర్వహించిన ఈ పోటీల్లో 22 పాఠశాలలకు చెందిన 275 మంది బాలబాలికలు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఆగస్టు 11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ (కాగితంతో చేసే కళ) పోటీలు జరగనున్నాయి. ఆసక్తి ఉన్న వారు 99853 64430, 87901 60232 నంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష్ దాస తెలిపారు.

జాతీయ మల్లకంభ పోటీలకు గుడిలోవ విద్యార్థి



చందు

ప్రజాశక్తి - ఆనందపురం : విద్యా భారతి ఆధ్వర్యంలో జరిగిన జోన్ స్థాయి క్రీడా పోటీలలో శ్రీ సరస్వతి విద్యా విహార్ గుడిలోవ విద్యార్థి ఆర్.చందు ప్రతిభ కనబరిచాడు. కర్ణాటక రాష్ట్రం బెలగావిలో జరిగిన మల్లకంభ పోటీలలో 14 సంవత్సరాల బాలుర విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించి నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరగనున్న విద్యా భారతి అఖిల భారతీయ జాతీయ స్థాయి పోటీలకు చందు ఎంపికయ్యాడు. చందును పాఠశాల ప్రధానాచార్యులు దూసి రామకృష్ణ, అధ్యాపకులు అభినందిస్తూ జాతీయ స్థాయిలో కూడా విజయపథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

50 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాళ్ళ వలస పంచాయతీ, యాతపేటలో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వైద్యులు ఎస్.భారతి 50 మందిని పరీక్షించారు. ఇందులో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. చిట్టివలస శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖ, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో చిట్టివలస, శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, జోనల్ కో-ఆర్డినేటర్ ఎంవి సత్యసాయికుమార్, జిల్లా జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ డి.శరత్‌కుమార్, వైద్య శిబిరం కో-ఆర్డినేటర్ వై.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశ భక్తి బృందగాన పోటీలు



దేశ భక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజానాట్యమండలి ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రీ విజేత హైస్కూల్‌లో 'దేశభక్తిని చాటుదాం' బృందగాన పోటీలు శనివారం నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలో ఉన్న భారతీ స్కూల్, బ్రిలియంట్ స్కూల్, తోటగరువు జడ్‌పిహెచ్ స్కూల్, శ్రీవిజేత స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్, క్రిస్టియన్ స్కూల్, అంజన స్కూల్ తదితర 8 పాఠశాలల నుండి 120 మంది విద్యార్థులు పాల్గొని దేశభక్తిని ప్రబోధిస్తూ బృందగానాలు ఆలపించారు. ఈ బృందగాన పోటీలకు అన్నమయ్య కళాక్షేత్రం నిర్వాహకులు వై.అప్పారావు, భగవాన్‌దాస్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడుతూ, 'దేశభక్తిని చాటుదాం' అంటూ బృందగాన పోటీలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో ఐక్యత భావాన్ని పెంచడం, వారిలో ఉండే కళల్ని వెలికి తీయడం, నిజమైన దేశభక్తిని చాటడం, పాటల పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశం అని పేర్కొన్నారు. శ్రీవిజేత స్కూల్ ప్రిన్సిపల్ రేఖ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి పిల్లల్ని ఎంతో ఉత్సాహ పరచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలను ఎం.ఉమామహేశ్వరరావు నడిపించారు.

పాఠశాలలను సందర్శించిన డిఇఒ



వెల్లంకి జడ్పీ హైస్కూల్లో పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక కెజిబివిని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శని వారం సందర్శించారు. ఈ సందర్భంగా అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి సెక్రటరీ కృష్ణకుమార్, ఎంఇఒ-2 డి.శ్రీనివాసరావు, ఎఎస్‌పిఒ అప్పలనాయుడు, ప్రిన్సిపల్ గంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్.ప్రేమ్‌కుమార్ సందర్శించారు. సోమవారం నుండి ప్రారంభమయ్యే పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్‌లెట్స్, వాటి రికార్డులను పాఠశాలలో పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు. పాఠశాల లైబ్రరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కె.గంగరాజు, ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్‌కుమార్, డిసిఇబి కార్యదర్శి కృష్ణ కుమార్, సమగ్ర శిక్ష ఎపిఒ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్ది పాల సంఘం ఎన్నికకు అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఉన్న పాల సంఘం అధ్యక్షుల ఎన్నికకు తెలుగుదేశం, వైసిపి అభ్యర్థుల ఎంపిక నిర్వహించారు. వారం రోజుల నుండి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. తెలుగుదేశం మాజీ మండల అధ్యక్షులు కాళ్ల నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభ్యర్థులను ఎంపిక చేశారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న పాడి రైతులందరూ బుగత ప్రకాష్‌ను సూచించడంతో గ్రామస్థాయి నాయకులు ఆమోదించారు. వైసిపి నుండి ఎంపిపి కె.రాంబాబు, బుగత సత్యనారాయణ ఆధ్వర్యాన పాడి రైతులతో ప్రత్యక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆ వర్గం నుండి పాల సంఘం అధ్యక్షుని ఎంపికపై చర్చించారు. వైసిపికి చెందిన పాడి రైతులు బుగత సన్యాసినాయుడును (ఎర్ని నాయుడు) ఎంపిక చేసుకున్నారు. దీంతో పాల సంఘం ఎన్నికలపై గ్రామాల్లో వేడి మొదలైంది. పాడి రైతులు, పశువుల పాకల వద్ద పశువుల కాపరులు ముమ్మరంగా చర్చించుకుంటున్నారు. విశాఖ డైయిరీ యాజమాన్యం ఎన్నికల తేదీ ప్రకటించడం కోసం ఎదురుచూస్తున్నారు. పాల సంఘంలో సుమారు 600 మంది రైతులు పాలు పోస్తున్నారు. వీరిలో 450 మందికి ఓటు హక్కు ఉంది. కనీసం 230 ఓట్లు సాధించుకున్న అభ్యర్థి సంఘం అధ్యక్షునిగా ఎన్నికవుతారు.

గురుకులంలో సమస్యల కొలువు..

- దెబ్బతిన్న 7, 10 తరగతుల పైకప్పు
- చినుకు పడితే వేరే గదుల్లో బోధన
- డైనింగ్ హాల్ నిర్మాణంలో ఎడతెగని జాప్యం
- నేటికీ ఐదో తరగతి విద్యార్థినులకు అందని విద్యామిత్ర



భీమిలిలోని ఎపి గురుకుల పాఠశాల ఇదే..

ప్రజాశక్తి -భీమునిపట్నం

స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో అనేక సమస్యలు కొలువుదీరాయి. 5 నుంచి 10వ తరగతి వరకు 480 మంది బాలికలు చదువుతున్నారు. 12 తరగతి గదులు ఉన్నాయి. తరగతులను ఎ, బి సెక్షన్లుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున విభజించారు.

చినుకు పడితే అవస్థలు..

వర్షం కురిస్తే టెన్త్ ఎ సెక్షన్‌లో ఉన్న 40 మంది బాలికలు, ఏడో తరగతి ఎ, బి సెక్షన్‌లో ఉన్న చెరో 40 మంది బాలికలు ఇబ్బందులు పడాల్సిందే. టెన్త్ గది స్లాబ్ అయినప్పటికీ ఫ్యాన్ కింద ఇతర చోట్ల పూర్తిగా వర్షం ధారలా కారుతుందని బాలికలు చెప్పారు. ఏడో తరగతి రెండు సెక్షన్లలో నడుస్తున్న తరగతి గదుల పైకప్పు రేకుకు చిల్లులు పడడంతో వర్షం కురిస్తే వేరే తరగతి గదుల్లోకి వీరిని తరలిస్తున్నారు. 480 మంది బాలికలకు 60 స్నానపు గదులు, ఇంకో 60 టాయిలెట్లు ఉన్నాయి. వాస్తవంగా బాలికల అవసరాలకు ఇవి చాలవనే చెప్పొచ్చు.

ఐదోతరగతికి అందని విద్యా మిత్ర కిట్లు

విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తుంది. ఇప్పటికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు ఇక్కడి 5వ తరగతి విద్యార్థినులకు చేరలేదు. 80 మందికి గాను 70 మంది బాలికలు 5వ తరగతిలో ఇప్పటికీ ప్రవేశం పొందారు. ఇంకా 10 మంది ప్రవేశం పొందాల్సి ఉందని ప్రిన్సిపల్ తెలిపారు.

నేలపైనే భోజనం...

480 మంది విద్యార్థినులకు సరిపడా డైనింగ్ హాల్ లేదు. గతంలో ఉన్న డైనింగ్ హాల్ భవనం మరమ్మతులకు గురవ్వడంతో దాన్ని గత వేసవి సెలవుల్లో కూల్చేశారు. ఆ స్థానంలో డైనింగ్ హాల్ నిర్మించలేదు. సంబంధిత స్థలం పక్కనే కొత్తగా డైనింగ్ హాల్ నిర్మించినా, పూర్తి స్థాయిలో సరిపోయే పరిస్థితి లేదు. బాలికలు నేలపైనే భోజనం చేయడం ఇబ్బందిగానే ఉంటుంది. వంట గది కూడా మరమ్మతులకు గురైంది. తాత్కాలిక మరమ్మతులు చేశారు.

మరమ్మతుకు గురైన మోటారు..

పాఠశాలలో ఉన్న మోటార్లలో 5 హెచ్‌పి మోటారు గత కొద్ది రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. దీంతో నీరు సరిపడక బాలికలు కొంత ఇబ్బంది పడుతున్నారు.

మేథ్స్ టీచర్ కొరత..

గెస్ట్ ప్రాతిపదికన మహిళా మేథ్స్ టీచర్ పోస్ట్ భర్తీకి చర్యలు చేపట్టారు. ఎంఎస్‌సి పూర్తయిన వారు ఇందుకు అర్హులుగా ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఈ పోస్టు భర్తీ కాకపోవడంతో మాథ్స్ సిలబస్ నిర్ణీత గడువులోగా ఎలా పూర్తవుతుందో మరి.

ఈ ఏడాది నుంచి పిఎఎల్ ల్యాబ్...

ఎపి గురుకుల పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి పర్సనలైజ్ అడాప్టివ్ లెర్నింగ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. 6 నుంచి 9వ తరగతి వరకు వారంలో రెండు పీరియడ్లు పిఎ ల్యాబ్‌పై బోధన ఉంటుంది. కేవలం తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులలో మాత్రమే ఈ పద్ధతిన బోధిస్తారు. టాపిక్ వారీగా ప్రశ్న, జవాబు పిఎఎల్ ల్యాబ్ ద్వారానే సులభంగా తెలుసుకోవచ్చు. కేవలం ఈ విధానం గురుకుల పాఠశాలల్లోనే అమలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎంపిక చేసిన ఆయా సబ్జెక్ట్ టీచర్లకు ఇప్పటికే ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది.

టీచర్ పోస్టులు ఇలా..

ఈ పాఠశాలలో తెలుగు బోధించేందుకు ఇద్దరు, హిందీకి ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు. ఇంగ్లీష్‌కు ముగ్గురు, సైన్స్‌కు ముగ్గురు, సోషల్‌కు ఇద్దరు ఉన్నారు. మాథ్స్‌కు ముగ్గురు ఉండాలి. ఇద్దరు ఉన్నారు.

ప్రతికూలతలోనూ ఫలితాల్లో మేటి..

సౌకర్యాల పరంగా పూర్తి స్థాయిలో లేకున్నా సరే ఏటా టెన్త్ పరీక్షా ఫలితాల్లో ఇక్కడి బాలికలు సత్తా చాటుతుండడం గమనార్హం. ఇక్కడ చదువుతున్న వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వారే.

సిఐ ఉమాకాంత్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సిఐగా సిహెచ్.ఉమాకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆత్మకూరు సత్యనారాయణ బదిలీపై కోర్టు మానటరింగ్ సెల్ విభాగానికి వెళ్లిపోగా అక్కడ ఉన్న ఉమాకాంత్ ఇక్కడకు వచ్చారు. సత్యనారాయణ నుంచి ఉమాకాంత్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉమాకాంత్‌కు స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలందించి అభినందించారు. స్టేషన్ సిబ్బందిని పరిచయం చేసుకున్న ఉమాకాంత్ అన్ని విభాగాలను పరిశీలించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఉమాకాంత్‌కు గతంలో విశాఖ సిటీతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు చోట్ల పనిచేసిన అనుభవం ఉంది. 2013లో ఆయనకు ప్రమోషన్ లభించింది. స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారంతో పాటుపడతానని ఈ సందర్భంగా ఉమాకాంత్ పేర్కొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు స్వాగతం పలికారు. సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు ముందుగా వేదమంత్రాలతో కప్ప స్తంభం ఆలింగనం చేయించారు. అనంతరం బేడా మండపం ప్రదక్షిణ చేయించి స్వామివారి దర్శనం కల్పించారు. స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి పటం, ప్రసాదాలు బహూకరించారు.


విరాళం అందిస్తున్న మావూరి వెంకటరమణ, కుటుంబీకులు

నిత్యాన్న ప్రసాదానికి 'సిఎంఆర్' విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నిత్యాన్న ప్రసాదానికి సిఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మావూరి వెంకట రమణ, ఆయన కుమారుడు బాలాజీ రూ.2 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావుకు అందజేశారు. ఈ విరాళంపై వచ్చే వడ్డీతో ఏటా ఒక రోజు తమ పేరున స్వామివారి నిత్యాన్న ప్రసాదం భక్తులకు అందించాలని కోరారు. దాతలకు స్వామివారి దర్శనం అనంతరం శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

నగరానికి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : గుజరాత్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథరాయ్ రెండు రోజులు పర్యటన నిమిత్తం నగరానికి చేరుకున్నారు. జిల్లా కోర్టును ఆయన ఆదివారం సందర్శిస్తారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఎం.సత్యనారాయణచిత్రపటాన్ని ఆవిష్కరిస్తారు.

ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన ఎం.సత్యనారాయణ నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించారు. పేదరికంలోనే ఎంఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ న్యాయ కళాశాల నుంచి న్యాయ పట్టా పొందారు. న్యాయవాదిగా 38 సంవత్సరాలు పాటు పనిచేసి 2022లో తుది శ్వాస విడిచారు. క్రిమినల్ కేసుల్లో ఘనాపాఠిగా కొనసాగిన ఆయన ఎందరో యువ న్యాయవాదులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన కుమారుడు అనిల్ కుమార్ కూడా న్యాయవాదిగా ఉన్నారు. ఆదివారం ఉదయం న్యాయవాదుల సంఘం నూతన భవనంలో సత్యనారాయణ చిత్రపటాన్ని జస్టిస్ మానవేంద్రనాథరాయ్ ఆవిష్కరిస్తారని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఎంకె.శ్రీనివాస్, ఎల్‌పి.నాయుడు తెలిపారు.

ఆక్రమణపై చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలో ప్రభుత్వ మంచినీటి బోరును ఆక్రమించి సాగిస్తున్న అక్రమ ఇంటి నిర్మాణంపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. తహశీల్దార్ శ్రీనుబాబు ఆదేశాల మేరకు ఆర్ఐ అవినాష్, విఆర్ఒ అప్పారావు సిబ్బందితో కలిసి శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంచినీటి బోరును ఆక్రమించి నిర్మాణాలు చేయడం తగదని హెచ్చరించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే నిర్మాణాలు జరపాలని, పక్క భూములను, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించడం తగదని స్పష్టం చేశారు. ఆక్రమణకు పాల్పడితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనుబాబు హెచ్చరించారు.


నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలంలోని పెద్దిపాలెం 11 కెవిపై 24 గంటలు త్రీ ఫేస్ లైన్ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని ఇఇ మండల అప్పలనాయుడు తెలిపారు. పెద్దిపాలెం, పల్లెపేట, పడాల వారి కల్లాలు, బిపి కల్లాలు, పొడుగుపాలెం, చందక, జగన్నాధపురం, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులవాడ, చీమలమెట్ట మీద పాలెం తదితర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి



హెచ్‌పిసిఎల్ గేటు వద్ద నిరసన....

ప్రజాశక్తి -ములగాడ : అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శనివారం హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ లేబర్ గేటు వద్ద నిరసన తెలిపారు. సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, అదాని స్మార్ట్ మీటర్లు ఇంటికి పెట్టకుండా అడ్డుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెడితే మీటర్ల పగలగొట్టండి అని లోకేష్ చెప్పి ఇప్పుడు వాటిని పెట్టడానికి అంగీకరించడం న్యాయం కాదన్నారు. హెచ్‌పిసిఎల్ కాంటాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నరేష్ మాట్లాడుతూ, పనికి తగ్గ వేతనాలు లేక ఉపాధి లేక చాలీచాలని జీతాలతో జీవితాలు గడుపుతుంటే విద్యుత్ ఛార్జీల భారాలు వేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు పి.పైడిరాజు, ఎన్.శ్రీనివాసరావు, వి.నీలయ్య, సురేష్‌కుమార్, హేమంత్ కిషోర్, కిరణ్, రాజు, వెంకటేష్, ఎస్.వాసు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 60వ వార్డు పరిధి శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద ముఠా కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముఠా కార్మికుల సంఘం అధ్యక్షులు పి.పైడిరాజు మాట్లాడుతూ, ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. కరెంట్ చార్జీలు విపరీతంగా పెరిగి ప్రజలపై భారాల పడతాయని, అందుకే వీటిని పెట్టకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గండి రమణ, ముఠా కార్మికులు అప్పలనాయుడు, సత్యారావు, బి.అప్పారావు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.పైడిరాజు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలి

- రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి

- కర్మాగారం గేట్ వద్ద రైతులు, కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని, రైతులు, కార్మికులు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు, కార్మికులు, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీ గేట్ వద్ద పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఎమ్‌డి కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్వీ నాయుడు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మిక, రైతు నాయకులు మాట్లాడుతూ గత సీజన్‌కు సంబంధించి రైతులకు సుమారు రూ.30 కోట్లు, కార్మికులకు నెలల తరబడి బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు అనేక హామీలు ఇచ్చారని, ఏ ఒక్క హామీ కూడా నేటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార రంగంలో ఉన్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీ ఇదేనని, దీనిని కూడా ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కో-ఆపరేటివ్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి ఫ్యాక్టరీ ఆస్తులను తెగనమ్మేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్టు కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫ్యాక్టరీ ఆధునికీకరణ, రైతులు, కార్మికులు బకాయిలకు నిధులు విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ శ్రీనివాసరావు, ఏడువాకు శ్రీనివాసరావు, జగదీష్, దండుపాటి తాతారావు, కార్మిక యూనియన్ నాయకులు రామునాయుడు, రైతు కూలీ సంఘం నాయకులు భాస్కర్, సరగడం అప్పారావు, పీల రమణ, కొణతాల గణేశ్వరరావు, రైతులు కార్మికులు పాల్గొన్నారు.



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, కార్మికులు



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చిన్నతల్లి

ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి పెరుగు బజారు నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు మాట్లాడుతూ కొంతమంది భవన యజమానులు కోర్టుకు వెళ్లడం, మరికొంతమందికి టీడీఆర్‌లు అందకపోవడంతో తాత్కాలికంగా ఇంతకాలం పనులు జరగలేదని తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే టీడీఆర్‌లు చెల్లించాలని ఆదేశాలిచ్చారని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చేబ్రోలు దుర్గాప్రసాద్, పీలా నాగ శ్రీను, మంగ ఈశ్వర్, దూలం గోపి, మడగల శ్రీను, కోట్ని రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, తలారి ప్రసాద్, పెతకంశెట్టి జగన్మోహన్‌రావు, సాలాపు మోహన్, పెంటకోట గణేష్, చేబోలు సత్య, భవన నిర్మాణ యజమానులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రుద్ర భూమిలో శివుని విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో రుద్రభూమిలో శనివారం గ్రామానికి చెందిన మంగాల పెద్ద కన్నయ్య గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శివుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. రుద్ర భూమిలో శివుని విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లును వారి మనవళ్ళు జెర్రిపోతుల జగదీష్ రమేష్ మధుబాబుల చేతుల మీదుగా నిర్వహించారు.

బీసీల అభివృద్ధికి టిడిపి కృషి

ప్రజాశక్తి-మునగపాక : బీసీల ఆత్మగౌరవం నిలబెట్టడానికి, వారి అభివృద్ధికి టిడిపి కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లలో మాట్లాడుతూ బీసీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసేందుకు టిడిపి పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్ కల్పించి రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం పాల్గొన్నారు.

పరవాడలో టివిఎస్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడలో అఖిల ఏజెన్సీస్ సమీపంలో విశాఖ టివిఎస్ వారు నూతన టివిఎస్ టూ వీలర్ షోరూమ్ ప్రారంభమైంది. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కత్తిరించి షోరూమ్ ప్రారంభోత్సవం చేశారు. షోరూమ్‌లో ప్రదర్శనకు ఉంచిన టివిఎస్ వాహనాలను పరిశీలించి, వాటి ఫీచర్ల గురించి మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. టివిఎస్ టూ వీలర్లు లేటెస్ట్ టెక్నాలజీ, ఆకర్షణీయమైన ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పైల సన్యాసిరావు మాస్టారు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, పైల రామచంద్రరావు, పైల చిన అక్కునాయుడు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, లోకిరెడ్డి అభినాయుడు, పైల ప్రసాదు, బోజింగి అప్పలనాయుడు, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నేత బండారు అప్పలనాయుడు



ఎండిపోతున్న వరి నారు

భిన్న వాతావరణంతో రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కొద్దిరోజులుగా వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎండలు కాసే సమయంలో వర్షాలు, వర్షాలు కురిసే సమయంలో ఎండలు కాయడం పరిపాటిగా మారింది. వర్షం కురిసింది కదా అని వరి విత్తనాలు వేస్తే.. తరువాత వేసవిని తలపించే ఎండలు కాస్తున్నాయి. దీంతో రైతులు సాగును ఏ విధంగా చేయాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు. జూన్ చివర, జులై ప్రారంభంలో వారం రోజులపాటు ముసురుకోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సాగులో భాగంగా వరి విత్తనాలను వేశారు. మొలకెత్తి వరి నారు ఆశాజనకంగా ఉంది అనుకునే సమయంలో జులై చివర నుండి మండు వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో వరి నారుమళ్ళను రక్షించుకోవడానికి నానా పాట్లు పడ్డారు. కొంతమంది వ్యవసాయ మోటార్ల ద్వారా మరి కొంతమంది బావుల ద్వారా నారుమళ్ళను తడిపారు. మరికొంతమంది ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి వరి ఆకు నారును రక్షించుకున్నారు. జులై చివరి వారం, ఆగస్టు మొదటి రెండు వారాల్లో ముమ్మరంగా వరి నాట్లు పడాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. వర్షం జాడ లేకపోవడంతో రైతులు బోర్లు, చెరువుల్లో ఉన్న నీటితో కొద్ది మేరకు వరి నాట్లు వేస్తున్నారు. అయితే వర్షాలు పడాల్సిన సమయంలో ఎండకాస్తుండడంతో వరి నాట్లు వేసిన తరువాత ఎండిపోతే పరిస్థితి ఏమిటన్న ఆందోళన రైతుల్లో ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రాంబిల్లి : మామిడివాడ గ్రామం పైడితల్లమ్మ గుడి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని ఎన్ఎబి కాలనీకి చెందిన అమలకంటి గోవిందు కుమారుడు అమలకంటి వాసు (25) రాఖీ పండుగ సందర్భంగా శనివారం ఉదయం బంధువులతో కలిసి ఎస్.రాయవరం మండలంలోని వొమ్మవరం గ్రామానికి వెళ్లాడు. రాఖీ కట్టి భోజనం చేసి అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మామిడివాడ గ్రామం, పైడితల్లమ్మ గుడి సమీపంలో గాజువాక నుండి యలమంచిలి వైపు అధిక వేగంగా వస్తున్న టాటా ఎసి వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాసు తీవ్ర గాయాలు పొందగా, అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. వాసుతో ప్రయాణిస్తున్న అన్న కుమార్తె భారతి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై రాంబిల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై నీరు నిల్వ

ఇబ్బంది పడుతున్న వాహనదారులు



తాళ్లపాలెం సంత మార్కెట్ వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజాశక్తి-కశింకోట : తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డులో మండలంలోని తాళ్ళపాలెం సంత మార్కెట్ వద్ద చిన్న పాటి వర్షానికి రోడ్డుపైకి నీరు చేరుతుంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 10 సంవత్సరాలు క్రితం రోడ్డుకు రెండు వైపులా వర్షం నీరు పోయందుకు చిన్న కాలువలు ఉండేవి. రాను ఆ కాలువలు కప్పేయడంతో వర్షం పడితే నీరు రోడ్డుపైకి చేరుతోంది. సంత మార్కెట్ మంచి బంగారయ్యపేట మర్రి చెట్టు వరకు ఒక కాలువ ఉండేది. అది నేడు కనుమరుగైంది. రెండో వైపు మార్కెట్ నుండి ప్రస్తుతం పోలవరం కాలువ వరకు ఒక కాలువ ఉండేది. ఆ కాలువ కూడా లేకపోవడంతో కాలనీ వాసులు వాడే నీరు కూడా రోడ్డుపై పారుతోంది. దీంతో రోడ్డు మరమ్మతులకు గురై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మూసి వేసిన కాలువలను తీయించి నీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వర్షపు నీరు పోయే మార్గమేదీ?

- మూడు అడుగుల లోతులో నీరు నిల్వ

- గోతులతో అవస్థలు

- నెలల తరబడి వాహనదారులకు ఇబ్బందులు

- పట్టించుకోని పంచాయతీ, ఆర్ అండ్ బి అధికారులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గత మూడు నెలలుగా మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ రోడ్డులో కొద్దిపాటి వర్షానికి భారీగా వర్షపు నీరు చేరడం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడం పరిపాటిగా మారింది. పత్రికల్లో కథనాలు వచ్చిన అధికారుల్లో చలనం మాత్రం లేదు. వర్షానికి రోడ్డుపై సుమారు రెండు నుంచి మూడు అడుగుల మేర చేరుతుంది. వర్షపు నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే నీరు నిలిచిపోతుంది. వర్షపు నీరు నిలిచిన ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు ఆ గోతుల్లో పడి ఇబ్బందులు పడుతున్నారు. కానీ పంచాయతీ అధికారులు కానీ ఆర్ అండ్ బి అధికారులు గానీ వర్షపు నీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలన్న ధ్యాస లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం కురిసిన వర్షానికి నీరు చేరడంతో నీటిలో గల గొయ్యిలో ఆటో మరమ్మతులకు గురైంది. దీంతో ఆ ఆటోలో సామాన్లను మరో ఆటోలకు మార్చుకుని డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు.



గొయ్యిలో పడి మరమ్మతులకు గురైన డోర్ ఆటో

కూటమి పాలనలో పెట్టుబడులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

కూటమి ప్రభుత్వ ఏడాది కాలంలో 9 లక్షల 68 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మంచి ప్రభుత్వంగా భావించిన పారిశ్రామికవేత్తలు ఒక్కొక్కరు పెట్టుబడులు పెడుతున్నారన్నారు. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తుంటే వారికి వైసీపీ మూకలు ఎపిలో పెట్టుబడి పెడితే నష్టపోతారని ఈ మెయిల్స్ ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో బోడి వెంకటరావు, కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, మళ్ల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శంకరం రెవెన్యూలో అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి మండలంలోని పలుచోట్ల అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రధాన రహదారులు పక్కన అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను కూడా అధికారులు చూసీ చూడనట్లు విడిచిపెడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మరింతగా అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. శంకరం రెవిన్యూ పరిధిలో ఇలాంటి నిర్మాణాలు కొన్ని శరవేగంగా జరిగిపోతున్నాయి. శంకరం సర్వే నెంబర్ 19, 20, 21ల్లో ఇలాంటి నిర్మాణాలను ఎలాంటి అనుమతులు లేకుండా చేస్తున్నారు. లేఅవుట్లు, దానిలో అక్రమ నిర్మాణాలు ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండా జరిగిపోతున్నాయి. మట్టి గ్రావెల్‌తో కప్పేసి ఎవరికి వారు తమకు కావలసినట్టు నిర్మాణం చేస్తున్నారు. ఇలా భారీ నిర్మాణాలు కూడా వ్యాపార నిమిత్తం కట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాధారణంగా కమర్షియల్ నిర్మాణాలకు ప్రత్యేక అనుమతులు తీసుకోవాలి. కమర్షియల్ నిర్మాణాల కోసం అగ్నిమాపక శాఖ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ప్రాపర్ పార్కింగ్ ప్లాన్, ట్రాఫిక్ క్లియరెన్స్, ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్, నీటి సరఫరా, డ్రైనేజ్ అనుమతులు, ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఎన్‌ఓసి వంటివి ఉండాలి. వీటితోపాటు అనేక అనుమతులు ఉండాల్సి ఉన్న అవేమీ పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. వీఎంఆర్‌డిఏ అనుమతి ఉన్న పంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వకపోతే నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన కూడా ఉంది. అయితే గ్రామాల్లో చాలా చోట్ల అక్రమ కట్టడాలు కూటమి నాయకుల ప్రోత్సాహంతో యథేచ్ఛగా జరిగిపోతున్నాయనే ప్రచారం ఉంది.


జాతీయ రహదారి పక్కన చేస్తున్న అక్రమ నిర్మాణం

అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం

శంకరం సర్వే నెంబర్ 19, 20, 21లలో ఎలాంటి నిర్మాణాలకు పంచాయతీ నుంచి అనుమతులు ఇవ్వలేదు. సంప్రదిస్తే డాక్యుమెంట్స్ తెమ్మని చెప్పాం. అనుమతి లేని నిర్మాణాలను పరిశీలించి తొలగిస్తాం. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

- సంతోషి, శంకరం గ్రామ కార్యదర్శి

'నిందితుడు ఆత్మహత్యాయత్నంతో పోలీసులకు సంబంధం లేదు'

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడి గ్రామానికి చెందిన ముచ్చకర్ల కృష్ణమూర్తి ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటనతో పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐతంపూడి గ్రామానికి చెందిన ఐతిరెడ్డి శివకుమార్, ముచ్చకర్ల కృష్ణమూర్తి ఇరువురిని జూన్ 2వ తేదీన గ్రామంలో దొంగతనం కేసులో అనుమానితులుగా గుర్తించి కేసు నమోదు చేసి వారి వద్ద నుండి సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు ఐతిరెడ్డి శివకుమార్ గుడిలో దొంగతనం చేయడంతో 4000 రూపాయలు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. వీరిని జూన్ 2వ తేదీన వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరు పరచామని, ఆ సమయంలో ఎటువంటి గాయాలు లేవని వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. అయితే ఈ నెల 4వ తేదీన ముచ్చకర్ల కృష్ణమూర్తి వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి పోలీసుల వేధింపులే కారణమని కొంతమంది వ్యక్తులు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆ సంఘటనతో పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో వ్యవహరిస్తున్నామని సిఐ కోటేశ్వరరావు తెలిపారు.


మాట్లాడుతున్న సిఐ

ముఖ్యమంత్రిని కలిసిన బాలాజీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హెలిప్యాడ్ వద్ద ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఒడిశా గవర్నర్‌కు 'మా స్మృతిలో-మీ జ్ఞాపకాలు' పుస్తకం అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త కీర్తిశేషులు డాక్టర్ కొణతాల రామలింగ స్వామిపై రచించిన "మా స్మృతిలో -మీ జ్ఞాపకాలు" పుస్తకాన్ని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ శనివారం అందజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా ఆయన అందించిన సేవలు ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు శ్రీధర్ తెలిపారు.

శ్మశానానికి ప్రహరీ నిర్మించరూ..

ప్రజాశక్తి-కోటవురట్ల

మండలంలో బికె.పల్లి గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న రుద్రభూమికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం ఈ మార్గంలో పలు గ్రామాల ప్రజలు పాములవాక, వేములపూడి మీదుగా అత్యధికంగా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, మహిళలు, చిన్నారులు భయానికి గురవుతున్నారు. శుభ కార్యాలయాలకు వెళ్లే వారు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన పలువురు స్వచ్ఛందంగా ప్రహరీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అయితే పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ విషయమై టిడిపి మండల అధ్యక్షులు లింగన్న నాయుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పలువురు స్వచ్ఛందంగా ప్రహరీ నిర్మాణానికి పనులు ప్రారంభించినా మధ్యలో నిలిచిపోయాయని తెలిపారు. ఇప్పటికే నిర్మాణం చేపట్టిన వారిని సంప్రదించి త్వరితగతిన ప్రహరీ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు.


ప్రధాన రహదారి పక్కన ప్రహరీ లేని శ్మశానం ఇదే..

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బ్రాండిక్స్ కంట్రీ హెడ్ జనరల్ ఉదయ పరేరా అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా యువత ముందుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రాండిక్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల కోసం కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బ్రాండిక్స్ ఉద్యోగుల పిల్లలకు బంగారు భవిష్యత్ ఇచ్చేందుకు మై భారత్‌తో కలిసి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైభారత్ (ఎన్.వై.కె) డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ యువత కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ - ఇండియా (ఎన్.యు.జె-ఐ) ఢిల్లీ ఛైర్మన్ ఎన్.నాగేశ్వరరావు అనకాపల్లి జిల్లాలో ఉన్న పర్యాటక, ఆధ్యాత్మిక, వ్యాపార, పారిశ్రామిక, ఆదాయ రంగాలకు సంబంధించిన అంశాలను యువతకు వివరించారు. మారిటైమ్ యూనివర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీ జోగారావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విద్యా అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్రాండిక్స్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల ఉన్నతి కోసం తన సంస్థ మై భారత్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు హెచ్ఆర్ జనరల్ మేనేజర్ రఘు రామరాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ షేక్ సహజీద్ వెల్లడించారు. బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొర్రై స్వామి ఆదేశాల మేరకు ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సదస్సులో పాల్గొన్న యువతీ యువకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

సొసైటీని లాభాల బాటలో నడిపించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ పిఏసిఎస్‌ను లాభాల బాటలో నడిపించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చౌడువాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా రాజి నారాయణమూర్తి (నాని), సభ్యులుగా గొర్లె శంకర్రావు, ఈర్లే నాయుడుబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ పదవి అలంకరణ కాదని బాధ్యత అని, దానిని ఎల్లప్పుడూ మర్చిపోకుండా ప్రజలకు సేవ చేయాలని సూచించారు. జిల్లా సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న చౌడువాడ సొసైటీని మరి అంత లాభాల వైపు పయనించే విధంగా నూతనంగా పాలకవర్గం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు. చోడవరం నియోజకవర్గ జనసేన నాయకులు పివిఎస్ఎన్ రాజు. టిడిపి. మండల అధ్యక్షులు రంగాళి మహేష్, కూటమి నేతలు పైల అమ్మాజీ, బాలి బోయిన సంతోష్ యాదవ్, జీవి మూర్తి, దాట్ల శ్రీనురాజు, సుందరపు గంగాధర్. బ్యాంకు సీఈఓ బత్తిన సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

నేడు గౌరీ గ్రంథాలయ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీగౌరీ గ్రంథాలయం సర్వసభ్య సమావేశం ఈ నెల 10 ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రంథాలయంలోని కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో జరుగుతుందని గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ ప్రగతి నివేదిక, నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. పోస్టు కార్డు, సోషల్ మీడియా, మొబైల్ ద్వారా సభ్యులకు సమాచారం చేరవేయడం జరిగిందన్నారు. గ్రంథాలయ సభ్యులు సహృదయంతో సర్వసభ్య సమావేశానికి హాజరై గ్రంథాలయ పురోగతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 92471 66511 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.


ఎంపిటిసి సత్యనారాయణను పరామర్శిస్తున్న జోగులు

పాల్తేరు ఎంపిటిసికి జోగులు పరామర్శ

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు ఎంపిటిసి సభ్యులు ఇసరపు సత్యనారాయణ ఇటీవల చేతికి ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు శనివారం పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సత్యనారాయణ ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు (దొంగబాబు), పార్టీ సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దేవవరపు వెంకటేశ్వరావు, సర్పంచులు పన్నీరు పాపారావు, కోడా కోటేశ్వరరావు, చేపల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి కాలువ ద్వారా సాగునీరు అందించే మంగళాపురం ఆనకట్టు వద్ద ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నీటిని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రూ.12.80 లక్షలతో ఇటీవల మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో భూతనాథ నాని కుమార్, దొడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'మదర్' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-సబ్బవరం : మదర్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త, లక్ష్మి ఎంటర్ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు అన్నారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో ట్రస్ట్ 11వ వార్షికోత్సవం ట్రస్ట్ ఛైర్మన్ వి. సత్యంగంగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ నేర్చుకున్నవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సుమారు 250 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పౌల్ట్రీ యూనియన్ ప్రధాన కార్యదర్శి భరిణికాన సాయినాథరావు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, సబ్బవరం-2 ఎంపిటిసి బైలపూడి దేముడుబాబు, పల్లా తాతారావు, దెడ్డం పద్మావతి, అధిక సంఖ్యలో మహిళలు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చొక్కాకుల వెంకటరావు

గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

-జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్

ప్రజాశక్తి-చీడికాడ:గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు.మండలంలోని కోణంలో శనివారం జరిగిన ఆదివాసి దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత ఎమ్మెల్యేలు మైదాన ప్రాంత గిరిజన గ్రామాల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆమె స్పందించి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివాసి దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివాసి ఆచార, సంప్రదాయాలను గుర్తు చేశారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మైదాన ప్రాంత గిరిజన గ్రామాల గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎమ్మెల్యేలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదివాసి ఆచార సంప్రదా యాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు, ఆదివాసీల సంఘ నేతలు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు రాఖీ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బండారు

శివపురం వన్ వే రోడ్డు అస్తవ్యస్తం

అవస్థలు పడుతున్న వాహనదారులు, పాదచారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం:నర్సీపట్నం పట్టణ పరిధిలో ప్రయాణికులకు, భారీ వాహనాలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శివపురం లలిత నర్సింగ్ హోమ్ నుండి పోలీస్ స్టేషన్ మీదుగా కేటాయించిన వన్ వే రోడ్డు గోతులమయంతో అధ్వానంగా మారింది. దాదాపుగా మూడు నాలుగు సంవత్సరాల నుంచి ఈ రోడ్డు నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో స్థానికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ వన్ వే మీదుగా తూర్పుగోదావరి జిల్లా నుండి వచ్చే వివిధ వాహనాలతో పాటు కేడీపేట, శరబన్న పాలెం, ఏలేశ్వరం, మంప, కొయ్యూరు నుండి వచ్చే వాహనాలు పట్టణంలోకి వెళ్లకుండా పోలీస్ స్టేషన్ మీదుగా చింతపల్లి రోడ్డు నుంచి ప్రయాణించే దుకు కేటాయించారు. అయితే లలిత నర్సింగ్ హోమ్ నుంచి చింతపల్లి రోడ్డు వరకు పూర్తిగా రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వం పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు 26వ మున్సిపల్ వార్డు కార్యాలయం కూడా సమీపంలోనే ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుకుంటున్నారు.

ఈ విషయంపై సంబంధిత డివిజనల్ ఇంజనీర్ కామేశ్వరరావు వివరణ కోరగా కాలువ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు అయ్యాయని, రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

మూడు, నాలుగు సంవత్సరాలుగా ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డు వెంబడి స్పీకర్ అయ్యన్న రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రాత్రి సమయంలో మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.



రామకృష్ణ
జనసేన
10వార్డు ఇంచార్జి


గోతుల రహదారిపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులు


రాఖీ వేడుకలో విద్యార్థులు, నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక వెనుక బడిన తరగతుల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మోహన్ సాయిలు మాట్లాడుతూ, విద్యార్థులలో సోదరి భావం పెంచడానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఆడపిల్లలకు, మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేసినా అమలుకు నోచ్చుకోలేదన్నారు. ముఖ్యంగా సినిమా, సీరియల్స్‌లో అసభ్యకరంగా చూపిస్తు న్నారని, ఇవి ప్రజలపై ప్రభావం చూపిస్తున్నాయని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు సాయి, సత్య, రాజేష్, దినేష్, కార్తీక్, ఆకాష్, రవి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ కట్టి స్వీట్లు తినిపించి ప్రేమానుబంధాలను ,ఆత్మీయతను చాటుకున్నారు. నక్కపల్లి గురు కులంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా విద్యార్థినిలకు సోదరులు వచ్చి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా గురుకులంలో సందడి నెలకొంది. ప్రిన్సిపల్ ఉషారాణి, సువర్ణ రాఖీ పర్వదినం సందర్భంగా పలు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి సారె

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏటిగైరంపేటలో నూకాంబిక అమ్మవారికి చీర, సారే సమర్పించామని వాసవి క్లబ్ యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలనే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైమండ్ కేసీజిఎఫ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ పిలుపు మేరకు స్థానిక నూకాంబిక అమ్మవారికి ఏటిగైరంపేట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చీర సారె సమర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ జోన్ చైర్ పర్సన్ శ్రీరామ్ లక్ష్మణరావు సహాయ సహకారాలు అందించారు.

ఘనంగా గణపతి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో నూతనంగా నిర్మించిన గణపతి ఆలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. పురోహితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు గణపతిని దర్శించుకున్నారు.

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలు ప్రాంతాల నుండి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.


వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఇఒ-2గా కృష్ణప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల విద్యాశాఖాధికారి-2గా గాలి కృష్ణప్రసాద్ శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒ కృష్ణప్రసాద్‌కు ఎంఇఒ-1 ఓ.సత్యనారాయణ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పలు చోట్ల చీరల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :రక్షాబంధన్ పురస్కరించుకొని శనివారం మండల కేంద్రమైన నాతవరంలో నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సూర్య చంద్ర ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడి సురేష్ ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండేం దొరబాబు, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు, పొన్నం పోతురాజు, వర్రే నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం:రాఖీ పండుగ సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు చేతుల మీదుగా మండల కేంద్రంలో పలువురు వితంతు మహిళలకు శనివారం ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైచర్ల నాయుడు మాట్లాడుతూ, జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పలు సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్చార్జ్ పి.వి.ఎస్.ఎన్ రాజు ఆధ్వర్యాన వైద్య శిబిరాలు, అన్న సమారాధన కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బంటు రాము నాయుడు, వీర మహిళ అధ్యక్షురాలు, స్కూల్ కమిటీ చైర్పన్ దొడ్డి పోలమ్మ, మండల ప్రధాన కార్యదర్శి లోట్ల శివ, కార్యదర్శులు ముక్కా రామసూరి, కోన రమణ, దాసరి చిన్నబ్బాయి, గ్రామ పార్టీ అధ్యక్షులు నాగభూషణం పాల్గొన్నారు.


రావికమతంలో పంపిణీ చేస్తున్న నాయకులు

ఆదివాసీలంటేనే సహజ నైపుణ్యం, సామర్థ్యం

-ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు


చంద్రబాబుకు జిసిసి ఉత్పత్తులను చూపుతున్న ఎమ్‌డి

ప్రజాశక్తి పాడేరు: సహజ నైపుణ్యం, సామర్థ్యం ఆదివాసీల సహజ గుణాలని గిరి పుత్రుల్లో మరింత చైతన్యం తీసుకురాగలిగితే అభివృద్ధికి ఢోకా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగిలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వంజంగిలో వనదేవత మోదకొండమ్మ ఆలయాన్ని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ పండుగలను వేడుకలను తిలకించారు. ఆదివాసీ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. టూరిజం అభివద్ధిపై తీసుకుంటున్న చర్యలు, ప్రాజెక్టుల వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నాన్నారు. విత్తన పండుగలు, సంక్రాంతి వరకూ ఎంతో పవిత్రంగా జరుపుకుంటున్నారని సిఎం కితాబు ఇచ్చారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని, దాన్ని నేను కొనసాగిస్తున్నానన్నారు.

ఒకప్పుడు ఏజెన్సీ అంటే గంజాయి ప్రాంతమని చెడుగా భావించేవారని. గత ప్రభుత్వం స్వచ్ఛమైన ఏజెన్సీలను కలుషితం చేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా గంజాయి మాట వినపడటంలేదు' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.

ఆగస్టు 15 నుంచి గిరిజన ఆడబిడ్డలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు నన్నారు ఏజెన్సీలో 7 అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరున మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకం చేస్తామని తెలిపారు. పాడేరు మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నామనీ సీఎం చంద్రబాబు తెలిపారు..

నూరు శాతం రిజర్వేషన్ కల్పించాలి
సిఎంకు ఆదివాసీ గిరిజన సంఘం, స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ నేతల వినతి

మెగా డీఎస్సీలో ఏజెన్సీ గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, ఆదివాసీ స్పెషల్ డీఎస్‌సి సాధన కమిటీ జిల్లా చైర్మన్ కుడుముల కాంతారావు, జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్నపడాల్, ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సత్యనారాయణతో కూడిన ప్రతినిధి బృందం లగసపల్లిలో హెలిఫేడ్ వద్ద శనివారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ జీవో 3 స్థానంలో, మరో ప్రత్యామ్నాయ ఉత్తర్వులు ఇస్తామని, సుప్రీంకోర్టు తీర్పునీ దృష్టిలో పెట్టుకొని నిపుణులతో కమిటీ వేశామని, చర్చిస్తున్నామని, అతి త్వరలో 100శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పి.అప్పలనర్స విలేకరులతో మాట్లాడుతూ, ప్రకటనల పేరుతో కాలయాపన చేయడంతో ఏజెన్సీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, ఇప్పటికి పాడేరు ఏజెన్సీలో సుమారు 20వేల మంది టీచర్స్ పోస్టులకు అర్హతలు సాధించారాని, కానీ రిజర్వేషన్ కల్పించక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం 100శాతం రిజర్వేషన్ కల్పించే ఉత్తర్వులు జారీ చేసే వరకు కూడా ఉద్యమం సాగిస్తామన్నారు.భవిష్యత్తు కార్యాచరణ పై రాష్ట్ర జిల్లా కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసి ప్రకటిస్తామన్నారు. వీటితోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి సమర్పించిన వివిధ సమస్యలపై వినతి పత్రం గూర్చి వివరించారు. వాటీ వివరాలు... ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని, ఆదివాసీ మాతృభాషా విద్యా వాలంటరీలకు ఉద్యోగ భద్రత, గురుకులం సెక్యూరిటీ గార్డ్స్, ఏకలవ్య విద్యాసంస్థల్లో గెస్ట్ ఫ్యాకల్టీ, సిఆర్టిల సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారమన్నారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి పరిశీలిస్తామని, సమస్య పరిష్కరిస్తానన్నారు.

నిరుత్సాహపరిచిన సిఎం పర్యటన
- గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం
- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు: ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా పాడేరు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసి సమాజం కొండంత ఆశతో ఎదురుచూస్తున్న 100శాతం ఉద్యోగ రిజర్వేషన్, టీచర్ పోస్టులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఉత్త్వర్వులు ఇవ్వకుండా ప్రకటనలతో సరిపెట్టడంపై గిరిజన అభ్యర్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో సుమారు 20,000 మంది టీచర్ పోస్టులకు అర్హులు ఉన్నారని, మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు కోల్పోయే అవకాశాలు ఎక్కువ కనిపిస్తుందన్నారు.ఆదివాసి దినోత్సవం రోజు ఆదివాసులు కానుకగా న్యాయం చేస్తారని భావించామని, ఆదివాసుల ఆశలు నెరవేర్చకుండా నిరాశపరిచారని తెలిపారు.


అరకులోయలో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాయడంతో స్థానికులు, పర్యాటకులు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఇంతలోనే భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాహన చోదకులు స్థానికులు సేద తీరారు. అరకులోయ, అనంతగిరి, విశాఖ ప్రధాన రహదారి ఘాట్ రోడ్లులో కుండ పోత వర్షం కురవడంతో వాహన చోదకులు అసౌకర్యానికి గురయ్యారు.

చింతూరు: మండలంలో శనివారం పెద్ద ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. ఏకధాటిగా సుమారు రెండున్నర గంటల సేపు కుంభవృష్టి కురిసింది. డ్రైనేజీలు నిండిపోయి రోడ్డుపై నీరు నిలిచిపోయింది. సాయిబాబా గుడి నుంచి సినిమాహాలు



మీదుగా వాడబజారు ఎస్టీ కాలనీ మెడికల్‌కాలనీ రోడ్లు జలమయమయ్యాయి. నడిచేందుకు కూడా వీలు లేకుండా నీరు నిలిచిపోయింది. రోడ్లపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయినాయి.

అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పాయకరావుపేట

పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థలో క్లస్టర్-7 అంతరరాష్ట్ర (ఆంధ్రా, తెలంగాణా) ఖోఖో పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అండర్-14, 17, 19 బాలురు, బాలికల విభాగాల్లో సుమారు 180 టీములు పాల్గొన్నాయి. పోటీలు 3 రోజుల పాటు నిర్వహిస్తున్నామని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, సిబిఎస్ఇ అబ్జర్వర్, ఖో- ఖో ఫెడరేషన్ సెక్రెటరీ సిహెచ్. ఎల్.ఎమ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శనివారం జరిగిన మ్యాచ్‌లు, విజేతలు

- అండర్-17 బాలికల విభాగంలో నాచారం సుప్రభాత హైస్కూల్- కర్నూల్ శ్రీ సుధా ఇంగ్లీష్ మీడియం స్కూల్ మధ్య జరగ్గా నాచారం సుప్రభాత హైస్కూల్ విజేతగా నిలిచింది.
- బొమ్మూర్సిపేట శాంతినికేతన్ విద్యాలయ- రాజమండ్రి భారతీయ విద్యా భవన్ మధ్య జరిగిన పోటీల్లో శాంతినికేతన్ విద్యాలయం విజయం సాధించింది.
- స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్-హైదరాబాద్ భారతీయ విద్యాభవన్ మధ్య జరిగిన పోటీలో భారతీయ విద్యాభవన్ గెలుపొందింది.
- అండర్ -19 బాలికల విభాగంలో హైదరాబాద్ సిస్టర్ నివేదితా స్కూల్- హైదరాబాద్ పేస్ స్కూల్ మధ్య జరిగిన పోటీలో సిస్టర్ నివేదితా విజయం సాధించింది.
- ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్- గుంటూరు డాక్టర్ కెఎల్ ప్రసాద్ స్కూల్ మధ్య జరిగిన పోటీలో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ విజేతగా నిలిచింది.
- ఆల్వాల్ సిటీ పల్లవి మోడల్ స్కూల్- తిరుపతి వరిటాస్ సైనిక్ స్కూల్ మధ్య జరిగిన పోటీలో వరిటాస్ సైనిక్ స్కూల్, తిరుపతి గెలుపొందింది.
- అండర్ -19 బాలుర విభాగంలో తిరుపతి ఎకార్డ్ స్కూల్- జడ్చెర్ల ఎస్‌వికెఎం స్కూల్ మధ్య జరిగిన పోటీలో ఎకార్డ్ స్కూల్ విజేతగా నిలిచింది.
- అండర్ -17 బాలుర విభాగంలో బొమ్మూర్సిపేట శాంతినికేతన్ విద్యాలయ- కొవ్వాడ విష్ణు స్కూల్ మధ్య జరిగిన పోటీలో శాంతినికేతన్ విద్యాలయం విజయం సాధించింది.
- హైదరాబాద్ స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్- బోడుప్పల్ సిద్దార్థ పబ్లిక్ స్కూల్ మధ్య జరిగిన పోటీలో సిద్దార్థ పబ్లిక్ స్కూల్ గెలుపొందింది.
- అండర్-14 బాలుర విభాగంలో నర్సింగపాలెం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీప్రకాష్ అధినేత

హీల్ స్కూల్- జడ్చెర్ల గీతాశ్రీ హైస్కూల్ మధ్య జరిగిన పోటీలో హీల్ స్కూల్ విజయం సాధించింది.

- తెనాలి వెస్ట్ బెర్రీ స్కూల్- విజయవాడ శ్రీస్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ మధ్య జరిగిన పోటీలో శ్రీస్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ విజేతగా నిలిచింది.
- రాజమండ్రి భారతి విద్యా భవన్- రంగారెడ్డి ఫార్ట్యూన్ బటర్ఫ్లై స్కూల్ మధ్య జరిగిన పోటీలో ఫార్ట్యూన్ బటర్ఫ్లై స్కూల్ విజయం సాధించింది.

రైతులకు ఆర్థిక భరోసా 'అన్నదాత సుఖీభవ'

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకే అన్నదాత సుఖీభవ పథకం ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ పథకం దేశంలోనే ఆదర్శవంతమైనదని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు జనసేన కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్రతో కలిసి శనివారం జరిగిన కూటమి శ్రేణుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన అనకాపల్లి పట్టణంలో అన్నదాత సుఖీభవ రైతు యాత్ర జరుగుతుందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకే కూటమి ప్రభుత్వ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ